# Onboard LH752

*శుక్రవారం, సెప్టెంబర్ 12, 2008*

ఫ్రాంక్‌ఫర్ట్‌లో వుదయం పదకొండూ యిరవై నిముషాలకి హైదరాబాద్‌కి బయల్దేరింది నేనెక్కిన ఫ్లైట్. ఆఫ్‌పీక్ సీజన్ కాబోలు విమానంలో చాలావరకు ఖాళీగా వుంది. 'మీక్కావాల్సిన సీట్లో కూర్చోవచ్చు, if available...' అంది వో క్రూమెంబర్. G45 నుంచి C5 విండోసీట్లోకి మారాను. బానే వుంది... అటు పక్కన వో యాభయ్యేళ్లావిడ కూర్చున్నారు, పడుకున్న తన మనవడికేసి చూసుకుంటూ. కేసర్థమయింది. అమెరికా నుంచి వస్తున్నారు కాబోలు (నేను బ్రిటన్‌నుంచి సుమండీ!). నానమ్మో అమ్మమ్మో కానీ పిల్లాడ్ని తనతో తీసుకెళ్తున్నారు యిండియాకి, యేడెనిమిది నెల్లుంటాయేమో బాబుకి. తనూ తన మనవడు - యింకెవరూ రావట్లేదేమో...

'Fill in these landing cards, please' అంటూ వచ్చింది వో జర్మన్ అమ్మాయి. నేనోటి తీసుకున్నాను. 'పిల్లాడికి కూడా కావాలా?' పక్కావిడ అడుగుతున్నారు అచ్చ తెలుగులో. భుజాలెగరేసింది జర్మనమ్మాయి - అవునో కాదో తనకర్థంకాలేదో యేమీ reveal చెయ్యకుండా. ఆవిడ నావేపు చూస్తే నేను తల నిలువుగా వూపాను, తను రెండు కార్డ్స్ తీసుకున్నారు - కొంచెం నింపండి అని నాకు యిస్తూ.

వీడి అమ్మాబాబూ హాయిగా అమెరికాలో యెంజాయ్‌చేస్తూ పిల్లాడ్ని ముసలావిడకి అంటగట్టారు - నాకు చికాకు మొదలయింది. యెందుకు సీటుమారాన్రా అనుకుంటూనే ఆవిడ దగ్గర landing cards, passports తీసుకున్నాను. చెప్పొద్దూ - నా వూహ నిజమే. ఆవిడ అమెరికా నుంచే, అబ్బాయి తన మనవడే, వయసు యేడునెల్లే. నా వూహాశక్తి మీద నాకే ముచ్చటేసింది. అయినా పిల్లాడ్ని గ్రాండ్మాకీ పక్కనున్న పాసెంజర్స్‌కీ అంటగట్టిన ఆ తల్లిదండ్రులమీద సలసలమంటోంది. 'నాకేంపని' అనుకున్నాను - అయిష్టంతో మొదలుపెట్టి విపులంగా వివరాలన్నీ అడుగుతూ రెండు కార్డ్సూ నింపాను తదేక దీక్షతో. ఆవిడ అభిమానాస్పదంగా చూశారు. యేదో సంతృప్తి నాలో. Bitternessని జయించిన ఆనందం.

హైదరాబాద్‌లో - నాకు దూరంగా - పెరుగుతున్న నా పిల్లలు గుర్తొచ్చారు. వారిని అంతకాలమూ నేను లేకుండా పెంచిన మా ఆవిడ గుర్తొచ్చింది. తనకి సాయంగా వున్న అంకుల్, అమ్మా నాన్నా గుర్తొచ్చారు. పక్కన పిల్లాడి తల్లిదండ్రులూ గుర్తొచ్చారు - వారి అవసరాలు గుర్తొచ్చాయి. వొకరిపై వొకరు ఆధారపడే ఆ అమరిక అర్థమవుతోంది. తమ కన్వీనియెన్స్‌కోసం అమ్మమ్మలకీ పక్కన పాసింజర్స్‌కీ పిల్లల్ని వదిలేసే తలిదండ్రుల మీది నా కోపమూ ఆవిరవుతోంది. వారిమీది కోపం పిల్లాడిమీదా వాడి అమ్మమ్మ మీదా చూపించాలనే నా అసంకల్పిత ప్రతీకారేచ్చకు నాకు సిగ్గేసింది.

'Would you like a drink, please?' అంటూ వచ్చాడు వో యూరోపియన్ అబ్బాయి. 'Red wine please' - చెప్పాను. వైనూ, బాదంపప్పు ప్యాకెట్టూ యిచ్చాడు. అనౌన్సుమెంట్ విన్పడుతోంది - 'we are crossing Czech Republic, Slovakia and Romania'...

'Verbleibende Flugzeit: 6.10' - జర్మన్ భాషలో స్క్రీన్‌పై కనపడుతోంది. యింకా ఆరుగంటల పదినిముషాల్లో హైదరాబాద్ వెళ్లొచ్చని అర్థమయింది నాకు. నేను ఖాళీ చేసిన గ్లాసూ బాటిలూ తీసుకేళ్లామని వచ్చింది యింకో అమ్మాయి. తన రెండుచేతుల్లో యేడెనిమిది పళ్లాలు వున్నాయి అప్పటికే. 'I will come back' అంది నవ్వుతూ. 'What a shame - you have got only one pair of hands' అన్నాను నేను నవ్వుతూ... పక్కన అమ్మమ్మ పాలు కలుపుతోంది పిల్లాడికి.

యింకో ఆవిడ యేడుస్తున్న బాబునెత్తుకుని నా ముందు సీటాయన దగ్గరికి వచ్చింది - do you speak Telugu? అంటూ. అడ్డంగా తలూపాడు మానవుడు. 'Do you mind swapping the seats - these are spacious and I really need them' అందావిడ. నా జాతిమీద నమ్మకమేమో - అతను వొప్పుకోడనుకున్నా కానీ టక్కున లేచాడు - మారు మాటాడకుండా సీటు మారాడు. నేను అతన్ని చూస్తూ వుండిపోయా లిప్తపాటు.

పక్కన ఖాళీ అయిన గ్లాసూ, బాదంపప్పు పాకెట్టూ పలకరిస్తుండగా కిటికీలోంచి చూసాను. మేఘాలూ వాటికింద యిళ్లూ రమ్యంగా కన్పిస్తున్నాయి. బయట మైనస్ 70 డిగ్రీలు వుందంటోంది టీవీస్క్రీన్. ’ఔరా! నారదుడెంత అదృష్టవంతుడు’ అనుకుంటూండగానే - 'Can I top-up your glass' అంటూ వచ్చింది యింకో యెయిర్ హొస్టెస్. వనిత తనంత తానడిగితే కాదనడమెలా? సరే అన్నాను.

యింకా అయిదు గంటల దూరంలో హైదరాబాద్.

యేడేళ్లు నేను వసించిన యూకే గుర్తొస్తోంది. నన్ను మోసంచేసి తీసుకెళ్లిన కన్సల్టెంటూ, ముదట్లో మేమున్నా అపార్టుమెంటూ... నాకో దారిచూపిన యింగ్లిష్ స్కూలూ, నేను యూకే వదిలెళ్తున్నానని తడికళ్లతో సడిచేసిన క్రిస్ అండ్ జో లూ... గుర్తుకొస్తున్నారు... బిగ్‌బ్యాంగ్ యెక్స్‌పరిమెంట్ వల్ల బ్లాక్‌హోల్స్ యేర్పడి యిండియా, యూకే, శాన్‌ఫ్రాన్సిస్కో వొకే హోల్‌లోకి వస్తే యెంతబాగుంటుంది - ఆశపడ్డాడు క్రిస్. తనకు అత్యంత ప్రీతిపాత్రమయిన రాయల్ యెన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీనీ నన్నూ చూడ్డానికి వచ్చే క్రిస్మస్ సెలవుల్లో వస్తానన్నాడు యిండియా. ’యు మస్ట్ టేక్‌మీ టు చెనాయ్’ అన్నాడు. వోస్ అదెంతపని, నీకోసం మంచి వెదర్ కూడా అరేంజ్ చేస్తా అన్నాను.

యిండియా వెళ్లిపోదామని నేను వుద్యోగం మానేసిన సందర్భంగా నాకోసం చేసిన 'leaving do'కి దాదాపు అందరు - 40 మంది - కొలీగ్స్ వచ్చారు. రంజాన్‌మాసం కదా, వెళ్లేదేమూ పబ్‌కి. నేను రాలేను చాలా చాలా సారీ అంది ఫజీలా. ఆఫీస్‌తాలూకు జ్ఞాపకాల్ని భద్రపరుస్తూ చక్కని ఫోటో ఆల్బమ్ యిచ్చారు. నా పొలిటికల్ కెరీర్ బాగుండాలని ఆశించారు.

నేను శాశ్వతంగా యూకే విడిచి వచ్చేస్తుంటే అందరూ అదోలా అయిపోయిన వైనం నన్ను కదిలిస్తోంది. రాజకీయాల్లోకి వేళ్లే నా మిషన్ సక్సెస్ అవ్వాలని మనసావాచా తలుస్తామన్న నా స్నేహితుల జ్ఞాపకాలు నన్ను తొలుస్తున్నాయి.

* * *

పై వరకు రాస్తూ రాస్తూనే కునుకు పట్టినట్టుంది. అలాగే వదిలెయ్యడంతో ల్యాప్‌టాప్‌లో బ్యాటరీ 30% మిగిలుందని చూపిస్తోంది. యింకా రెండుగంటల దూరంలో హైదరాబాద్. అమ్మమ్మా పిల్లాడు యిద్దరూ నిద్దరోతున్నారు.

'Is the altitude 37000 metres?' అన్నాను యిటువైపుగా ట్రాలీతో వచ్చిన అబ్బాయితో. 'No, Sir. It's 37000 feet' అన్నాడు. ’నీకు యెక్కిందిరా’ అన్నట్టు విన్పడింది నాకు. అంతటితో ఆగాడా? ’11.3 kilometres or 11300 metres’ అన్నాడు తన జ్ఞానసంద్రంలో నన్ను ముంచితేలుస్తూ.

ఫ్రీగా యిచ్చిన వాల్‌స్ట్రీట్ జర్నల్ పక్కన రెపరెపమంటోంది. వొబామా వర్సెస్ మెక్‌కెయిన్. ప్రజారాజ్యం వర్సెస్ ప్రస్తుత పార్టీలు. ’మీరెటు వైపు’ - కొంచెం వంగుతూ ముందుసీట్లో అతన్ని అడిగా. హెడ్‌సెట్ తీసెస్తూ - వొబామానే అన్నాడు. ’మరి మన రాష్ట్రంలో?’ - నవ్వి వూరుకున్నాడతను.

’ప్రజలు మార్పుకోరుకుంటున్నారు’ - కాసేపాగి చిన్నగా అన్నాడు. యెన్నిసార్లో విన్నమాట. ఔనా? నిజమేనా? ’యే మార్పు అనేది తెలీదు కాకపోతే’ - ముగించాడు. ’అవినీతి బాగా పెరిగిపోయిందండీ’ అన్నాడు. ’యెవరో వచ్చి యేదో చెయ్యకపోతే కష్టం’ తేల్చేసాడు - అవినీతి చీడ తొలిగించే యెకలక్స్ మహాబలి వస్తాడన్న ఆశతో.

కిటికీలోంచి చూస్తే చిమ్మచీకటి. రేపటి వెలుగుల కోసం ప్రయాణం సాగుతూనే వుంది.

- శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
యూకే - యిండియా